# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 21 | సోమవారం | 17-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:21 | Monday | 17-8-2026 | Pages:08 | Cost:2/-



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'..

- విజయవాడలో మెగా డీఎస్సీ టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ
- వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం
- ప్రచారం ఆపకుంటే ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామని హెచ్చరిక
- ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది నూతన ఉపాధ్యాయులు
- కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే కించపరుస్తున్నారని ఆవేదన

2లో

# మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు
- సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి



స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి



## తిరుమలకు పోటెత్తిన భక్తులు

- శ్రీవారి సర్వదర్శనానికి 22 గంటల సమయం
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు
- శనివారం 90 వేల మందికి పైగా స్వామివారి దర్శనం

## ఘనంగా జనని–సూర్యతేజ వివాహం.. సతీసమేతంగా హాజరైన ఏపీ సీఎం

2లో

- హైదరాబాదులో ఘనంగా జరిగిన బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం
- పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఏడడుగులు
- హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన సీఎం చంద్రబాబు
- హైదరాబాద్ వేదికగా జరిగిన వేడుకకు రాజకీయ, సినీ ప్రముఖులు



ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఇంట పెళ్లి బాజాలు మోగాయి. ఆయన కుమార్తె జనని వివాహం ఆదివారం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఆమె ఏడడుగులు వేశారు. ఈ వివాహ వేడుకకు రాజకీయ, సినీ రంగాలకు చెందిన అగ్ర ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.




## చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు కొత్త రైలు..

- చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్
- అక్టోబర్ 2న ప్రారంభం కానున్న సర్వీసులు
- పూర్తిగా నాన్-ఏసీ, స్లీపర్ కోచ్‌లతో ప్రయాణం
- తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, యూపీ మీదుగా రాకపోకలు
- హైదరాబాద్ నుంచి ఇది ఆరవ అమృత్ భారత్ సర్వీస్




## ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు.. మండలిలో హోరాహోరీ!

- ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదన్న కారణంతో అసెంబ్లీకి వైసీపీ దూరం
- శాసనమండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని జగన్ వెల్లడి
- సభకు రావాలని వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు
- మెగా డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మండలిలో చర్చకు వైసీపీ వ్యూహం

2లో

# ఆత్మరక్షణలో మోదీ-షా!

- అనుకున్నది ఒకటి.. అయిందొకటి
- విద్యార్థులు, విపక్షాల పోరాటంతో వెనుకడుగు
- పార్లమెంట్ సమావేశాల్లో ముఖం చాటేసిన నంబర్ 1, 2
- డీలిమిటేషన్ వంటి కీలక బిల్లులకు కలుగని మోక్షం



2లో

న్యూఢిల్లీ, ఆగస్టు 16 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయ్యా యి..చప్పుగా ముగిసాయి కూడా. ఈ సమావేశాలు అంతటా (ఒక్క చివరి రోజు తప్ప) హోం మంత్రి అమిత్ షా గైర్హాజరయ్యారు. గైర్హాజర్ అనే కన్నా విపక్షాలకు జడిసి పారిపోయారు, ముఖం చాటేశారు అనడం సబబు. ప్రభుత్వానికి సంబంధించిన ఏ వ్యవహారంలో అయినా కీలక పాత్ర పోషించే వ్యక్తిగా, వాటిని సమర్థించే నేతగా మోదీ తర్వాత స్థానంలో షా




2లో

## వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

- వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షల నిర్వహణకు సర్కార్ ప్లాన్
- ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్
- వదంతులు నమ్మొద్దని, ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టాలని యువతకు సూచన

# ప్రభుత్వాల సెన్సార్‌షిప్‌పై ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం.. ఇక అన్నీ పబ్లిక్

**కంటెంట్ తొలగింపుపై ప్రభుత్వ ఆదేశాలను బహిర్గతం చేయనున్న ఎక్స్**

**పారదర్శకత పెంచడంలో భాగంగానే ఈ నిర్ణయమన్న ఎలాన్ మస్క్**

**ఏ ప్రభుత్వ ఏజెన్సీ అభ్యర్థించిందో యూజర్లు చూడగలరు**

**మస్క్ యాజమాన్యంలో ప్రభుత్వ అభ్యర్థనల అమలు రేటు అధికమని నివేదిక**

**రికమండేషన్ అల్గారిథమ్‌పైనా పారదర్శకతకు చర్యలు**

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కంటెంట్ తొలగింపు లేదా పరిమితులపై ప్రభుత్వాల నుంచి వచ్చే అభ్యర్థనలను యూజర్లకు మరింత స్పష్టంగా కనిపించేలా చేస్తామని ప్రకటించారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ జోక్యం, కంటెంట్ నియంత్రణ వంటి అంశాల్లో పారదర్శకతను పెంచే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. ఈ కొత్త మార్పుల గురించి ఎక్స్‌లో పోస్ట్ చేసిన మస్క్, "ప్రభుత్వాలు కోరిన ఏ సెన్సార్‌షిప్ అయినా ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది" అని తెలిపారు. దీని ప్రకారం, ఏ ప్రభుత్వ ఏజెన్సీ పోస్టులను తొలగించాలని కోరింది, ఏ ఖాతాలపై పరిమితులు విధించాలని అడిగింది వంటి వివరాలను యూజర్లు నేరుగా చూడగలుగుతారు. వీలైతే, ఆ అభ్యర్థనల వెనుక ఉన్న చట్టపరమైన కారణాలు లేదా సమర్థనలను కూడా వెల్లడించనున్నట్లు ఎక్స్ తెలిపింది. ఎక్స్‌ను కొనుగోలు చేసినప్పటి నుంచి ఆన్‌లైన్ కంటెంట్‌ను ఎలా నియంత్రిస్తున్నారు, ర్యాంక్ ఇస్తున్నారు అనే విషయాల్లో యూజర్లకు పూర్తి పారదర్శకత ఉండాలని మస్క్ బలంగా వాదిస్తున్నారు. ఈ తాజా నిర్ణయం కూడా ఆయన విస్తృత లక్ష్యాల్లో భాగమే. ఇదిలా ఉండగా, క్రిప్టో బ్రీఫింగ్ నివేదిక ప్రకారం, మస్క్ యాజమాన్యంలో ఎక్స్.. ప్రభుత్వాల నుంచి వచ్చిన టేక్‌డౌన్ అభ్యర్థనలను 83 శాతం నుంచి 98.8 శాతం వరకు అమలు చేసింది. ఇది పాత యాజమాన్యం కంటే అధికం కావడం గమనార్హం. కేవలం ప్రభుత్వ అభ్యర్థనలకే పరిమితం కాకుండా, తమ రికమండేషన్ అల్గారిథమ్‌లను కూడా ఎక్స్ పారదర్శకంగా ఉంచుతోంది. టెక్నాలజీలోని కొన్ని భాగాలను ఓపెన్-సోర్స్ చేయడం ద్వారా, ఏ పోస్టులను ప్రమోట్ చేస్తున్నారు, వేటిని తగ్గించి చూపుతున్నారు అనే అంశాలపై పరిశోధకులకు, యూజర్లకు స్పష్టత ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. మొత్తం మీద, కంటెంట్ నియంత్రణలో యూజర్లకు మరింత స్పష్టమైన సమాచారం అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.



# విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'..

తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు..

# మండలిలో హోరాహోరీ!

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.

**స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ**

సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.
అసెంబ్లీని బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పాలని వైసీపీ నిర్ణయించింది. పార్టీ శాసనసభ్యులతో ఇటీవల సమావేశమైన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, ఈ మేరకు ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకే చంద్రబాబు ప్రభుత్వం తమకు ఎల్ఓపీ హోదా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మండలిలో పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచించారు. మెగా డీఎస్సీ-2025పై చర్చించాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయాలని పార్టీ సభ్యులకు సూచించారు. దాదాపు 13 త్రైమాసికాలుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9,100 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.3,300 కోట్లను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ అంశాలను కూడా మండలిలో బలంగా ప్రస్తావించాలని జగన్ స్పష్టం చేశారు. దీంతో, అసెంబ్లీలో చర్చ ప్రశాంతంగా సాగినా, శాసనమండలిలో మాత్రం అధికార, విపక్షాల మధ్య వాడివేడి వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

## వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. నిన్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు కొత్త రైలు..

హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు ప్రయాణించే వారికి దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. చర్లపల్లి టెర్మినల్ నుంచి గోరఖ్‌పూర్ జంక్షన్ మధ్య కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (22075/22076) రైలును ప్రవేశపెట్టనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ నాన్-ఏసీ సూపర్ ఫాస్ట్ రైలు సర్వీసులు 2026 అక్టోబర్ నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.ఈ రైలు (22075) చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు తన రెగ్యులర్ సర్వీసును అక్టోబర్ 2వ తేదీ (శుక్రవారం) నుంచి ప్రారంభించనుంది. ప్రయాణానికి సుమారు 32 గంటల 40 నిమిషాల సమయం పడుతుంది. తిరుగు ప్రయాణంలో గోరఖ్‌పూర్ నుంచి చర్లపల్లికి (22076) సర్వీసు అక్టోబర్ 4వ తేదీ (ఆదివారం) నుంచి మొదలవుతుంది. ఈ రైలు వారానికి ఒకసారి రెండు దిశల్లోనూ రాకపోకలు సాగిస్తుంది.



## ఆత్మరక్షణలో మోదీ-షా!

కీలకంగా ఉన్నారు. అయితే ఈ సమావేశాల్లో మీడియాకు ఇచ్చిన చిన్న ప్రకటన తప్ప ఆయన క్రియాశీలకంగా ఎలాంటి పాత్ర పోషించ లేదు. దీనిపై ప్రముఖ పాత్రికేయురాలు శ్రవసి ?తదాస్‌గుప్తా 'ద వైర్' వెబ్‌సైట్‌లో దేశంలోని నెంబర్ వన్, టూ నేతలు విపక్షాలు, విద్యార్థులను ఎదుర్కోలేని వైనాన్ని విశ్లేషించారు. ఒక నెల క్రితం ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి పార్లమెంట్ వర్షాకాల సమావేశాల కోసం ఉత్సాహంగా ఎదురు చూసింది. పశ్చిమ బెంగాల్‌లో 15 ఏండ్ల పాలనలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించిన ఆనందం, పైగా ఆ పార్టీని చీల్చి టీఎంసీ అసమ్మతి ఎంపీల మద్దతు కూడగట్టడం, అలాగే శివసేన (యూబీటీ), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లలో కూడా చీలిక తెచ్చి వారి ఎంపీలను వేరు కుంపటి పెట్టించిన ఉత్సాహంతో ఉరకలేస్తూ ఉంది. కొత్తగా తమకు మద్దతు ఇస్తున్న విపక్ష చీలిక వర్గంతో ఈసారి డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు గట్టెక్కించేద్దామని పలు ప్రణాళికలు కూ డా సిద్ధం చేసింది. అనుకున్నది ఒకటి అయితే.. వాస్తవంలో పరిస్థితి ఇంకో విధంగా ఉంది. వివాదాస్పద బిల్లులను ఈ సమావేశాల్లో ఆమోదించడం అటుంచి యువత ఆందోళనకు తలొగ్గి తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోదీ బలవంతంగా తమ మంత్రినొకరిని పదవి నుంచి తప్పించాల్సి వచ్చింది. అమిత్ షా సభకు రావాలంటూ ప్రతి రోజూ డిమాండ్ చేస్తూ విపక్షాలు సభా నిర్వహణకు ఆటంకం కలిగించాయి. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగగా, ఒక్క ఆఖరి రోజు తప్ప ప్రధాని మోదీ, అమిత్ షాలు సభ ముఖం చూడలేదు. ఆఖరి రోజు నామమాత్రంగా హాజరైనా మూగనోము కొనసాగించారు. చిన్నాచితకా బిల్లులు ఆమోదం పొందినా ముఖ్యమైన ఫారిన్ కాంట్రిబ్యూషన్ బిల్లును కూ డా విపక్షం అడ్డుకోవడంతో దానిని సం యుక్త పార్లమెంటరీ కమిటీకి పంపారు.

## తిరుమలకు పోటెత్తిన భక్తులు

వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 22 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు వెలుపలికి కిలోమీటర్ల మేర విస్తరించాయి. రద్దీ పరిస్థితులను టీటీడీ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందజేస్తున్నారు. శనివారం (ఆగస్టు 15న) ఒక్కరోజే స్వామివారిని 90,293 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 53,090 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.81 కోట్లు వచ్చినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.



## ఘనంగా జనని-సూర్యతేజ వివాహం.. సతీసమేతంగా హాజరైన ఏపీ సీఎం

నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులు జనని, సూర్య తేజ వద్దకు వెళ్లి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ, బండ్ల గణేశ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన కుమార్తె పెళ్లి వేడుకకు చంద్రబాబు సతీసమేతంగా రావడం పట్ల బండ్ల గణేశ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఓ దశలో ఏడ్చేశారు. దాంతో పక్కనే ఉన్న సీనియర్ నటుడు బ్రహ్మాజీ ఆయనను ఊరడించారు. కాగా, వరుడు సూర్యతేజ సీఎం చంద్రబాబు-నారా భువనేశ్వరిల చేతులమీదుగా తాళి అందుకుని వధువు మెడలో మంగళసూత్రధారణ చేయడం విశేషం. బండ్ల గణేశ్ కు సినీ, రాజకీయ రంగాల్లో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో, ఈ వివాహ వేడుకకు ఇరు రంగాలకు చెందిన నాయకులు, నటీనటులు, నిర్మాతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి రాకతో వివాహ ప్రాంగణం సందడిగా మారింది. అతిథులను బండ్ల గణేశ్ దంపతులు సాదరంగా ఆహ్వానించి, వారి బాగోగులు చూసుకున్నారు. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




## ఘనంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ
- సంప్రదాయ దుస్తుల్లో మహిళల ప్రత్యేక పూజలు

**తొలివెలుగు, కర్మన్‌ఘాట్:** కర్మన్‌ఘాట్ బైరమాలగూడ దుర్గా నగర్ కాలనీలో కొలువైన శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను అలంకరించి నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చీర శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక ప్రతీకగా నిలుస్తుందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. మహిళలు భక్తిగీతాలు ఆలపిస్తూ, బోనాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇమ్మడి శ్రీశైలం, ఇమ్మడి రాములు, బెజవాడ గణేష్, చీర శ్రీనివాస్, సుకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ
- ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి మండలంలోని



సల్లోనిగూడెం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి, భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, పీఎస్ఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, సర్పంచ్ సామ రవీందర్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమిరి కిరణ్, మాజీ ఉపసర్పంచ్ సుర్వి కాటంరాజు, నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మండల స్థాయిలో గ్రీవెన్స్

- అర్జీదారులు దరఖాస్తుతో పాటు జిరాక్స్ ప్రతిని తీసుకురావాలి
- 18 శాఖల అధికారులు హాజరు కావాలి
- నోడల్ అధికారి, ఎంపీడీవో కూతల నాగవేణి

**తొలివెలుగు, రాజాపేట :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు నోడల్ అధికారి, ఎంపీడీవో కూతల నాగవేణి తెలిపారు. రాజాపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని 18 శాఖలకు చెందిన అధికారులు గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అధికారులను నేరుగా కలిసి అర్జీలు అందజేయవచ్చన్నారు.

**జిరాక్స్ తప్పనిసరి:**

దరఖాస్తుదారులు అర్జీతో పాటు ఒక జిరాక్స్ ప్రతిని తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎంపీడీవో కూతల నాగవేణి సూచించారు. ప్రతి దరఖాస్తును నమోదు చేసి, సంబంధిత శాఖల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.

## అత్తాపూర్ లో భక్తిశ్రద్ధలతో శ్రావణమాస కావడి యాత్ర

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అత్తాపూర్ నుండి రాంబాగ్ నివాసితులు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కావడి యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ యాత్రలో దాదాపు రెండు వందల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. మహిళలు, చిన్న పిల్లల ఆటపాటలు, శివనామ స్మరణల నడుమ ఈ శోభాయాత్ర కోలాహలంగా సాగింది. అత్తాపూర్ నుండి బయలుదేరిన ఈ యాత్ర చిన్న అనంతగిరి శివాలయం వరకు కొనసాగింది. ఆలయానికి చేరుకున్న భక్తులు పవిత్ర అభిషేక జలాలతో పరమశివునికి ప్రత్యేక అభిషేకాలు మరియు పూజలు నిర్వహించారు.

# పాపన్న స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం

- 18న రాజాపేటలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ
- హాజరుకానున్న రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు
- ఘనంగా నిర్వహించేందుకు గౌడ సంఘాల నేతల సన్నాహాలు



**తొలివెలుగు, రాజాపేట:** తొలి బహుజన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజాపేట మండల, గ్రామ గౌడ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 18న మంగళవారం రాజాపేట మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాపన్న మహారాజ్ వీర చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక అసమానతలు, అంటరానితనం, దోపిడీ లేని సమాజం కోసం పాపన్న చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.

సమాజంలోని అన్ని వర్గాలకు దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు అందినప్పుడే పాపన్న మహారాజ్ ఆశయాలు నెరవేరినట్లవుతుందని నాయకులు పేర్కొన్నారు. బహుజనులు ఐక్యంగా ముందుకు సాగి సామాజిక న్యాయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాల నాయకులు, బహుజన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బహుజనులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, కేజీకేఎస్ మండల కార్యదర్శి బత్తిని సత్యనారాయణ గౌడ్, నాయకులు భీమగాని గోపాల్ గౌడ్, బొంగోని ఉప్పలయ్య గౌడ్, నమిలే కేదార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గొంగిడి సునీతకు జర్నలిస్టుల జన్మదిన శుభాకాంక్షలు



- ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆత్మకూర్ జర్నలిస్టులు
- ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, జర్నలిస్టుల పాత్ర కీలకం

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** ఆలేరు మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డికి ఆత్మకూర్ మండల జర్నలిస్టులు ఆదివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రధాన కర్తవ్యంగా భావించి సేవ చేసే నాయకులను ఎల్లప్పుడూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారధులుగా పనిచేస్తూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు, ప్రజలు, జర్నలిస్టుల మధ్య సమన్వయం అవసరమన్నారు. గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి ప్రజా జీవితంలో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రజలకు సేవ చేయాలని జర్నలిస్టులు ఆకాంక్షించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆత్మకూర్ సీనియర్ రిపోర్టర్, నమస్తే తెలంగాణ విలేకరి ఎలిమినేటి నగేష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ విలేకరి, జిల్లా స్టాఫర్ మచ్చ రమేష్, తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆత్మకూర్ మండల అధ్యక్షుడు గడ్డం నాగరాజు, విలేకరులు మేడి శ్రీనివాస్, రాచమల్ల నాగరాజు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ వచ్చాకే ప్రజలకు తిప్పలు

- కేసీఆర్ పాలన కోసం ప్రజల నిరీక్షణ: సట్టు తిరుమలేష్
- రాజాపేటలో ఘనంగా గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- కేక్ కట్ చేసి సంబరాలు.. ఆసుపత్రుల్లో పండ్ల పంపిణీ



**తొలివెలుగు, రాజాపేట :** అన్ని వర్గాల ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని బీఆర్ఎస్ రాజాపేట మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయని ఆయన విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాజాపేట మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం స్థానిక ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలులో కేసీఆర్ పాలనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. గొంగిడి సునీత మహేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మాజీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్, మదర్ డెయిరీ డైరెక్టర్ సందిల భాస్కర్‌గౌడ్, మహిళా నాయకురాలు రమాదేవి, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, డైరెక్టర్ నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు బోగ హరినాథ్, బొంగోని ఉప్పలయ్య, గోపిరెడ్డి, మొగిలి నాగరాజు, గంధమల్ల సురేష్, బాలకృష్ణ, చెరుకు కనకయ్య, రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, బోనాల వెంకటేష్, కర్ల కరుణాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఎండీ ఆబిద్, కిష్టయ్య, రమేష్, రెడ్డబోయిన కవిత, రాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ కండువాలు ధరించి, మిఠాయిలు పంపిణీ చేస్తూ నినాదాలు చేశారు. ఇదే సందర్భంగా బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి కుమారుడు ఎడ్ల నరేష్‌రెడ్డి జన్మదినం కూడా కావడంతో సట్టు తిరుమలేష్ స్వీట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## చదువుకున్న పాఠశాలపై మమకారం.. విద్యార్థులకు ప్రోత్సాహం

- క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన కరాటే బాలు
- పూర్వ విద్యార్థిగా తన ఔదార్యాన్ని చాటుకున్న నీరటి బాల నరసయ్య

**తొలివెలుగు, రాజాపేట :** తాను విద్యాబుద్ధులు, క్రమశిక్షణ నేర్చుకున్న పాఠశాలపై ఉన్న మమకారంతో పూర్వ విద్యార్థి నీరటి బాల నరసయ్య (కరాటే బాలు) విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజాపేట బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తన సొంత ఖర్చుతో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కరాటే బాలు మాట్లాడుతూ.. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహానికి తన వంతు సహకారం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడలపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభ కనబరిచే వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బహుమతులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కిరణ్, ఉపాధ్యాయులు మాదివిలత, పడమటి అనురాధ, జానకి, సరిత, అండాలు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఇమ్మడి శిరీష, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాలపై మమకారంతో విద్యార్థులను ప్రోత్సహించిన నీరటి బాల నరసయ్యను వారు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## రావిర్యాల చౌరస్తాలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా...!



**మహేశ్వరం** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం రావిర్యాల గ్రామంలోని చౌరస్తాలో జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. గత 38సంవత్సరాలుగా గ్రామంలో జనవరి 26 గణతంత్ర దినోత్సవం, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం మరియు అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజుల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసే కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్న గోనెమని కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.రావిర్యాల గ్రామంలో మొట్టమొదటిసారి జాతీయ జెండాను గాంధీ చౌరస్తాలో ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం స్వతంత్ర సమర యోధులను స్మరించుకున్నారు. గత 38 ఏళ్లుగా ఎలాంటి విరామం లేకుండా ఈ సేవ చేస్తున్న గోనెమోని కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.



# ఘనంగా గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- ఆత్మకూర్ నుంచి భారీగా తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు
- పూలబొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానం

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** జఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ నాయకురాలు గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆత్మకూర్ మండలంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆత్మకూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆలేరు నియోజకవర్గ స్థాయి జన్మదిన వేడుకలకు తరలివెళ్లారు. వంగపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గొంగిడి సునీత మహేందర్‌రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూలబొకేలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆమె ప్రజా జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సునీత మహేందర్‌రెడ్డి చేసిన సేవలను, ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎర్ర సోమిరెడ్డి, ఆత్మకూర్ సర్పంచ్ బీసు ధనలక్ష్మి, సోలిపురం అరుణ, యాస కవిత ఇంద్రారెడ్డి, గడ్డం దశరథగౌడ్, కాంబోజు భాను ప్రకాష్, లగ్గాని రమేష్‌గౌడ్, కాలే మల్లేష్, పంజాల వెంకటేష్, వివిధ గ్రామాల బీఆర్ఎస్ శాఖల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలకు వడ్డెర ఓబన్న చరిత్రను చాటాలి

- రాజాపేటలో వడ్డెర ఓబన్న విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన
- వడ్డెర సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ



**తొలివెలుగు, రాజాపేట :** భవిష్యత్ తరాలకు వడ్డెర ఓబన్న చరిత్ర, పోరాట స్ఫూర్తిని తెలియజేసేందుకు కృషి చేస్తున్నామని రాజాపేట వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు గొల్లెన స్వామి అన్నారు. ఇందులో భాగంగా రాజాపేట మండల కేంద్రంలో వడ్డెర ఓబన్న విగ్రహ ప్రతిష్ఠకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. వడ్డెర సంఘం అధ్యక్షుడు గొల్లెన స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లెన స్వామి మాట్లాడుతూ.. వడ్డెర ఓబన్న చరిత్రను నేటి తరంతో పాటు భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓబన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజాపేట సర్పంచ్ కోయ మధు, ఉపసర్పంచ్ నెమిల కేదార్, పీఏసీఎస్ చైర్మన్ నెమిల మహేందర్‌గౌడ్, వడ్డెర ఓబన్న మండల అధ్యక్షుడు గొల్లెన శ్రీను, దూదివెంకటాపురం ఉపసర్పంచ్ ఇర్గదిండ్ల వెంకటేష్, సోమారం సర్పంచ్ గొలుసుల అనుష, చల్లూరు ఉపసర్పంచ్ బొంత సుధాకర్, వడ్డెర సంఘం కుల పెద్దలు, నాయకులు, కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహా ప్రాణదాత.. 117 సార్లు రక్తదానం

- మేక వెంకటేశ్వరరెడ్డికి అరుదైన గుర్తింపు
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రశంసాపత్రం అందజేత

**తొలివెలుగు, రాజాపేట :** నిరంతర రక్తదానం చేస్తూ పలువురి ప్రాణాలను కాపాడేందుకు తన వంతు సేవ అందిస్తున్న రాజాపేట మండలం నెమిల గ్రామానికి చెందిన మేక వెంకటేశ్వరరెడ్డికి అరుదైన గుర్తింపు లభించింది. 23 సంవత్సరాలుగా ఇప్పటివరకు 117 సార్లు రక్తదానం చేసినందుకు 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా వెంకటేశ్వరరెడ్డి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసిన వెంకటేశ్వరరెడ్డిని పలువురు అభినందించారు. ఆయన సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



# రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టు రట్టు

- ?850 కేజీల పీడీఎస్ బియ్యం సీజ్ చేసిన నిడమానూరు పోలీసులు
- ?ఆటో డ్రైవర్ అరెస్ట్.. ఆటో జప్తు



**తొలివెలుగు, నిడమానూరు :** అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని నిడమానూరు పోలీసులు పట్టుకున్నారు. నర్సింహాలగూడెం గ్రామ శివారులో శనివారం సాయంత్రం పెట్రోలింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పారం వైపు నుంచి త్రిపురారం వైపు అనుమానాస్పదంగా బియ్యం లోడ్‌తో వెళ్తున్న ఆటోను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. బజాజ్ ఆటో (టీజీ 05 టీ 7755) లో బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని పరిశీలించగా పీడీఎస్ బియ్యంగా తేలింది. మొత్తం 34 బస్తాలు, ఒక్కో బస్తా 25 కిలోల చొప్పున మొత్తం 850 కిలోల బియ్యం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బియ్యాన్ని తరలించేందుకు సంబంధించిన ప్రభుత్వ అనుమతి పత్రాలను చూపించాలని పోలీసులు కోరగా, తన వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని ఆటో డ్రైవర్ తెలిపినట్లు పేర్కొన్నారు. దీంతో బియ్యం లోడ్‌తో ఉన్న ఆటోను, డ్రైవర్‌ను నిడమానూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆటో డ్రైవర్‌ను విచారించగా వీర్లపాలెం, దామరచర్ల మండలానికి చెందిన ధనావత్ రాజు (42) గా, ప్రస్తుతం మిర్యాలగూడలోని అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ముప్పారం గ్రామానికి చెందిన రాంబాబు వద్ద నుంచి బియ్యాన్ని తీసుకుని త్రిపురారం, మిర్యాలగూడ వైపు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నందుకు ధనావత్ రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# పేదల ఆరోగ్య పరిరక్షణకే మెగా హెల్త్ క్యాంప్



- లయన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం
- నేలపట్లలో యశోద హాస్పిటల్ సౌజన్యంతో పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో నేలపట్ల గ్రామంలో ఆదివారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. యశోద హాస్పిటల్ సౌజన్యంతో, నేలపట్ల గ్రామానికి చెందిన గుర్రం శ్రీధర్ జ్ఞాపకార్థం ఈ ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షుడు ఎండి అతహర్ పాషా మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తమ క్లబ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో గ్రామ ప్రజలకు కంటి, పంటి, గుండెకు సంబంధించిన వివిధ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు వైద్యులు ఆరోగ్య సమస్యలపై సలహాలు, సూచనలు అందించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఉప్పు ఆంజనేయులు, కార్యదర్శి దాచేపల్లి రాజుగుప్తా, కోశాధికారి బత్తిని రఘుగౌడ్, గ్రామ సర్పంచ్ గంగాపురం వసంత నాగేష్‌గౌడ్, ఉపసర్పంచ్ చిన్నం బాలరాజు, పిల్లలమర్రి శ్రీనివాస్, కోడెం రాములు, గుర్రం ప్రమోద్‌కుమార్, గుర్రం వేణు, తిరందాసు జగన్నాథ్, కాసుల వెంకటేశంగౌడ్, గుర్రం శ్రీధర్, గంజి లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

# కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మెరిట్ స్కాలర్షిప్ లు అందించిన బ్రాంచ్ మేనేజర్

ఖమ్మం నగరంలోని కెనరా బ్యాంక్ మమత రోడ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సి.ఎస్.ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) లో భాగంగా 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కెనరా విద్యా జ్యోతి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న ఎస్సీ ఎస్టీ పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మమత రోడ్ బ్రాంచ్ మేనేజర్ కొనుగంటి ప్రవీణ్ కుమార్,అసిస్టెంట్ మేనేజర్ మారీశ్వరరావు, క్యాషియర్ రాంబాబు, వెంకటరమణ మరియు శాంతినగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యం

- నెల గౌరవ వేతనం రూ.6,500 పాఠశాలకు అందజేత
- విద్యాభివృద్ధికి సర్పంచ్ పులి రాజు ముదిరాజ్ చొరవ

**తొలివెలుగు, రాజాపేట :** విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తన వంతు సహకారం అందిస్తానని రాజాపేట మండలం నెమిల సర్పంచ్ పులి రాజు ముదిరాజ్ అన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తన నెల గౌరవ వేతనం రూ.6,500ను నెమిల ప్రాథమిక పాఠశాల వాలంటీర్ మంత్రి నగేష్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులి రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు విద్యారంగానికి కూడా ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి తన గౌరవ వేతనాన్ని అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు నమిల భరత్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సర్పంచ్ చూపుతున్న చొరవ ఇతరులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

# ఉత్తమ అవార్డు అందుకున్న నాగార్జున

- సేవలకు గుర్తింపుగా ప్రభుత్వ ప్రశంసాపత్రం
- పలువురి అభినందనలు

**తొలివెలుగు, రాజాపేట :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ సేవా అవార్డును ఇంటెలిజెన్స్ ఫీల్డ్ ఆఫీసర్ కె. నాగార్జున అందుకున్నారు. విధి నిర్వహణలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ప్రశంసాపత్రంతో సత్కరించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, భువనగిరి ఎమ్మెల్యే చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో నాగార్జున అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. వృత్తిపరంగా అంకితభావంతో విధులు నిర్వహిస్తూ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించడంపై నాగార్జునకు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఆయన మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఋ




# స్కేటింగ్‌లో వండర్ కిడ్స్!




- 80 నిమిషాల నాన్‌స్టాప్ స్కేటింగ్‌తో రికార్డు
- ఖేలో భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- మౌంట్ లిట్రా జీ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థుల ఘనత
- విద్యార్థులను అభినందించిన చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి, డైరెక్టర్ పిసాటి శ్రీకాంత్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్డులో ఉన్న మౌంట్ లిట్రా జీ స్కూల్ విద్యార్థులు స్కేటింగ్‌లో అరుదైన ప్రతిభ చాటి రికార్డు సాధించారు. 'ఖేలో భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన 80 నిమిషాల నిరంతర స్కేటింగ్ మారథాన్‌లో పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. జశ్వంత్, గౌతమ్, అక్షర, అయానా రామ్, సాన్వితలు ఎలాంటి విరామం లేకుండా 80 నిమిషాల పాటు నిరంతరంగా స్కేటింగ్ చేసి తమ ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణను చాటుకున్నారు. ఈ ఘనతతో రికార్డు సాధకులుగా నిలిచి పాఠశాలకు గర్వకారణంగా మారారు. విద్యార్థులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించిన స్కేటింగ్ కోచ్ సైదులు సేవలను పాఠశాల యాజమాన్యం అభినందించింది. రికార్డు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ కుంచారం జైపాల్ రెడ్డి, డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.






## శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఘట్టం,బోనాల ఉత్సవాలపై సమీక్షా....!

**మహేశ్వరం తొలివెలుగు,** మహేశ్వరం మండలం రావిర్యాలలో శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలు శ్రావణ మాసంలో ఘనంగా నిర్వహిస్తారు అలాగే ఈ సంవత్సరం సెప్టెంబర్ 1వ.తేదీలో నిర్వహించాలని ఆలయ అధికారులు,గ్రామ పెద్దలు నిర్ణయించారు.ప్రతి సంవత్సరం అమ్మవారి ఘట్టం,ఇంట్లో నుండి తీయడానికి గ్రామస్తులు పోటీ పడుతుంటారు..ఈ సంవత్సరం ఘట్టం తీయడానికి పోటీ వచ్చినవారిలో అంబోజి శ్రీకాంత్ యాదవ్ కు అమ్మవారి ఘట్టం ఊరేగింపు ఇంట్లో నుండి తీయడానికి అదృష్టం కలిసి వచ్చింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ..గత మూడు సంవత్సరాలుగా అమ్మవారి ఘట్టం,తీయడానికి పోటీ పడుతున్న కానీ ఈ సంవత్సరం అమ్మవారు దయతలచి ఆశీర్వాదం ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా అమ్మవారి బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు .గ్రామంలో ఉన్నప్రతి ఒక్కరు పాల్గొని అమ్మవారి బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలి గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు,కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## 119 కొత్వాలుగూడ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరిన యువత

**గండిపేట్,తొలివెలుగు** శంషాబాద్ జోన్ పరిధిలోని 119వ డివిజన్ కొత్వాలుగూడ గ్రామం నుండి పెద్ద ఎత్తున యువత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ గుంటి చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి సమక్షంలో యువత బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పుకుని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిన్నగండ రాజేందర్, శంషాబాద్ రెండు డివిజన్ల ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ, డివిజన్ వైస్ ప్రెసిడెంట్లు గుంటి చరణ్, పేదిరిపాటి మురళి గౌడ్, రాచమల్ల కార్తీక్, యూత్ అధ్యక్షుడు జివి పవిత్ర సాగర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచమల్ల రమేష్, డివిజన్ కమిటీ నాయకులు ప్రవీణ్ గౌడ్, మోసిన్, గుంటి బాలు, చంద్రశేఖర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఏ చరణ్, నిఖిల్, నవీన్, అనిల్, బేనోనీ, వరుణ్, అరుణ్, వరప్రసాద్, చంటి మరియు ఇతర యువకులు ఉన్నారు. కొత్వాలుగూడలో యువత పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం పార్టీపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు.

## నార్సింగి రేషన్ షాప్ వద్ద ప్రజల తీవ్ర అవస్థలు

**గండిపేట్,తొలివెలుగు:** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని రేషన్ షాప్ నెంబర్లు నాలుగు మరియు ఇరవై ఐదు వద్ద నిత్యావసర సరుకుల పంపిణీలో తీవ్ర అలసత్వం వహిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న తీరుపై మాజీ కౌన్సిలర్ ఉషారాణి అధికారులపై, డీలర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం ఏడు గంటల నుండే తీవ్రమైన ఎండలో గ్రామస్తులు, వృద్ధులు, మహిళలు క్యూ లైన్ లో గంటల తరబడి నిలబడ్డా రేషన్ బియ్యం అందక అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే డీలర్ అయిన శ్రవణ్ నాయక్ కు నార్సింగి మరియు పుప్పాలగూడ రెండు రేషన్ షాపుల నిర్వహణ బాధ్యతలు కేటాయించడం వల్లే ఈ సమస్యాత్మక పరిస్థితి నెలకొందని తెలిపారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న గ్రామస్తులకు కాకుండా కరీంనగర్, మహబూబ్నగర్ వంటి దూర ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు ఇక్కడ రేషన్ షాపుల నిర్వహణ కేటాయించడంపై నార్సింగి గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామున ఐదున్నర గంటల నుండే లైన్ లో నిలబడ్డామని బాధితులు వాపోతే, ఈ రోజు కుదరదని రేపు రావాలని డీలర్ చాలా నిర్లక్ష్యంగా బదులిచ్చారని మండిపడ్డారు. రోజూ పనిపాటలు వదిలేసి రావడం కష్టమని, కనీసం రోజువారీ క్రమం కోసం టోకెన్ ఇవ్వమని ప్రజలు వేడుకోగా, టోకెన్ సిస్టమ్ ఏమీ లేదని, రేపు కూడా ఉదయమే వచ్చి లైన్ లోనే నిలబడాలని షాప్ నంబర్ నాలుగు డీలర్ నిర్లక్ష్యపు సమాధానం చెప్పడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులు ఉన్నారని, తమకు త్వరగా రేషన్ ఇచ్చి పంపాలని విజ్ఞప్తి చేసినా కనీస మానవత్వం లేకుండా ప్రవర్తించారని ఆరోపించారు. ఎవరొచ్చినా సరే సరుకులు ఇచ్చేది లేదని, సాయంత్రం నాలుగు గంటలకు రమ్మని చెప్పి ఏకపక్షంగా షాప్ మూసివేసి వెళ్ళిపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే వ్యక్తికి రెండు షాపులు ఇవ్వడం వల్ల నిర్వహణ లోపించి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, వెంటనే నియమాలను మార్చి ఒక వ్యక్తికి ఒకే రేషన్ షాపు ఉండేలా చూడాలని అధికారులను కోరారు. అలాగే స్థానిక గ్రామానికి చెందిన వారికి మాత్రమే రేషన్ షాపుల నిర్వహణ బాధ్యతలు కేటాయించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీలర్ పై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ ఉషారాణి ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.



## గాంధీనగర్ వార్డుపై పంచాయతీ చిన్నచూపు!

- అభివృద్ధి పనులు లేక ప్రజల అవస్థలు
- వీధిదీపాలు లేక చీకట్లో రాకపోకలు
- సీసీ రోడ్లు, డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు
- సమస్యలు పరిష్కరించాలని స్థానికుల డిమాండ్

**తొలివెలుగు, జన్నారం:** జన్నారం మండలం పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ వార్డు అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో పంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. స్థానిక సర్పంచ్ వార్డు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

**వీధిదీపాలు లేక చీకట్లో అవస్థలు:**

వార్డులోని పలు ప్రాంతాల్లో వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీధిదీపాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సీసీ రోడ్లు లేక అధ్వానంగా మారిన రహదారులు:

వార్డులో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక రహదారులు అధ్వానంగా మారాయని స్థానికులు తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు రోడ్లు బురదమయంగా మారి నడిచేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

**డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు:**

సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు పలుచోట్ల నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి చేరడంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనేజీ కాలువలు నిర్మించి, ఉన్న కాలువలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

**ఇకనైనా పట్టించుకోవాలని వేడుకోలు:**

వీధిదీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నిసార్లు కోరినా సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానికులు పేర్కొన్నారు. పంచాయతీ పాలకవర్గం గాంధీనగర్ వార్డుపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




## నేడు చండూరులో బీఆర్ఎస్ ధర్నా



- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన
- హాజరుకానున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

**తొలివెలుగు, చండూరు :** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల మంజూరు, అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం చండూరు మండల కేంద్రంలో ధర్నా నిర్వహించనున్నారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. లబ్ధిదారులకు పథకాల సొమ్ము విడుదలలో జాప్యం జరుగుతోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎడిటోరియల్




# అమెరికన్ గోల్డ్ కార్డుకు భారీగా స్పందన

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే గోల్డ్ కార్డు ఆఫర్ ప్రకటించిన వెంటనే భారీగా స్పందన వస్తోంది. ఆదాయం పెంచుకునేందుకు ట్రంప్ వేసిన ఎత్తుగడలు ఫలిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పెట్టుబడి వీసా ఈబీ-5 స్థానంలో గోల్డ్ కార్డు తీసుకురానున్నట్లు వెల్లడించాక పలువురు ఆసక్తి చూపుతున్నారు. 5 మిలియన్ డాలర్లు అంటే సుమారు 44 కోట్లు చెల్లించగలిగే వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని ఇస్తున్నారు. ట్రంప్ ప్రకటించిన ఈ గోల్డ్ కార్డుకు అమెరికాలో భారీ స్పందన ఉన్నట్లు తెలుస్తోంది.**

ఈ నేపథ్యంలో తాజాగా గోల్డ్ కార్డుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను అధ్యక్షుడు విడుదల చేశారు. ట్రంప్ చిత్రంతో ఉన్న ఈ గోల్డ్ కార్డును ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడే సమయంలో చూపించారు. ఈ గోల్డ్ కార్డును 5 మిలియన్ డాలర్లు చెల్లించి ఎవరైనా సొంతం చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాదు ఈ గోల్డ్ కార్డును తానే మొదట కొనుగోలు చేసినట్లు ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రకటించారు. రెండో కొనుగోలుదారు ఎవరో తనకు తెలియదని చెప్పారు. ఈ గోల్డ్ కార్డు రెండు వారాల్లో అమ్మడ యిపోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. పౌరసత్వ కార్డుల ద్వారా వేగంగా జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని

కొంత వరకు తగ్గించవచ్చన్న అభిప్రాయంలో ట్రంప్ ఉన్నారు. ఈ క్రమంలో ఈబీ-5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ స్థానంలో గోల్డ్ కార్డు ఆఫర్లను ప్రకటించారు. ఈబీ-5 ప్రోగ్రామ్ ద్వారా అమెరికాలో పెట్టు-బడి పెట్టే విదేశీయులకు గ్రీన్ కార్డు ఇస్తారు. గోల్డ్ కార్డులను అమ్మనున్నామని, 5 మిలియన్ల డాలర్లకే ఆ కార్డును ఇవ్వనున్నట్లు- ట్రంప్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించారు. ట్రంప్ ప్రకటనతో ఈ గోల్డ్ కార్డులకు భారీ గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం ఒక్కరోజులోనే ఏకంగా 1,000 గోల్డ్ కార్డులు విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ ఇటీ-వలే వెల్లడించారు. వీటి ద్వారా దాదాపు 5 బిలియన్ డాలర్లు సేకరించినట్లు- తెలిపారు. 'ప్రపంచ వ్యాప్తంగా 37 మిలియన్ల మందికి గోల్డ్ కార్డును కొనుగోలు చేయగల సామర్థం ఉంది. ఒక మిలియన్ మంది వీటిని కొనుగోలు చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు. వీటిద్వారా 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉంది' అని లుట్నిక్ పేర్కొన్నారు. అసలు ఈ గోల్డ్ కార్డు ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఎవరిదన్న ప్రశ్నకు బదులిస్తూ.. అధ్యక్షుడు ట్రంప్‌దే అని బదులిచ్చారు. 'పెట్టుబడిదారు జాన్ పాల్సన్‌తో జరిగిన సమావేశంలో ట్రంప్ మదిలో నుంచి వచ్చిన ఆలోచన ఇది. అధ్యక్షుడి ఆలోచనను అమలు చేయడమే నా బాధ్యత. ఇందుకోసం నా వద్ద ప్రణాళిక ఉంది' అని చెప్పుకొచ్చారు. ఇకపోతే అమెరికా వలస విధానాల్ని మరింత కఠినతరం చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు వలసదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. స్వదేశానికి వెళ్తే.. తిరిగి అమెరికాకు రానిస్తారా? లేదా? అన్నదానిపై హెచ్1బీ వీసాదారులలో అనుమానాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి ప్రఖ్యాత టెక్ కంపెనీలు అప్రమత్తమయ్యాయి. తమ కంపెనీల్లో పనిచేస్తున్న హెచ్1బీ వీసాదారులను అప్రమత్తం చేస్తూ.. దేశాన్ని వీడొద్దని సూచించాయి. మళ్లీ అమెరికాకు తిరిగిరావడానికి అనుమతి ఉంటుందో? లేదోననే అనుమానాలు ఉన్నందున.. ఈ హెచ్చరికలు జారీచేస్తున్నట్టు సదరు కంపెనీలు పేర్కొన్నాయి. అమెరికాను వీడొద్దంటూ ఆయా ఐటీ కంపెనీలు తమ సిబ్బందికి ఇప్పటికే సూచించాయి. దీంతో భారత్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నట్టు పలువురు హెచ్1 బీ వీసాదార్లు చెప్పినట్టు 'వాషింగ్టన్ పోస్ట్' కథనం పేర్కొన్నది. ఒకవేళ చట్టాన్ని మార్చితే, వలసదార్ల పిల్లల పౌరసత్వం అగమ్యగోచరంగా మారేట్టు ఉందని ఒకరు వాపోయారని వార్తా కథనం తెలిపింది. అమెరికా పౌరులు మినహా, మిగతా అందరూ అక్రమ వలసదారులే అన్న భావన అక్కడ నెలకొని ఉందని భారతీయ వలసదారులు చెబుతున్నారు. దీంతో తాము ఎక్కడికి వెళ్లినా అవసరమైన పత్రాలన్నీ వెంట తీసుకెళ్తు న్నామని చెప్పారు.



# ఆన్‌లైన్ జూదాలను అడ్డుకోలేరా !

జూదాలు ప్రాణాలు తీస్తున్నాయి. జూదమొక్కటే కాకుండా మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటివన్నీ యువతను మత్తులో దింపుతున్నాయి. ఆ తరవాత అరాచక శక్తులుగా చేస్తున్నాయి. చివరకు ప్రాణ్యాలు తీస్తున్నాయి. వందలాదిమంది యువత ఆన్‌లైన్ గేమ్‌లకు బలవుతున్నారు. అయినా కఠిన చర్యలు కానరావడం లేదు. విచ్చలవిడి స్వేచ్ఛ కూడా భయంలేకుండా చేస్తోంది. చట్టాలను గౌరవించడం లేదు. హత్యలు,ఆత్మహత్యలు సర్వసాధారణం అయ్యాయి.

వీటిని అరికట్టేందుకు నిరంకుశ విధానాలు అవసరం. ప్రధానంగా బెట్టింగ్ యాప్‌లతో డబ్బుతో పాటు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అరికట్టాల్సిన పాలకులు చోద్యం చూస్తున్నారు. ముందుగా ఇంటర్‌నెట్ నుంచి ఇలాంటి యాప్‌లను నిషేధించే విషయంలో చర్యలు లేవు. యాప్లు, మద్యం, గుట్కా ప్రకటనలు నేటికీ వస్తున్నాయి. ప్రముఖ నటులు నటించిన ప్రకటనలు టీవీల్లో కోకొల్లలు. వీటిని తక్షణమే నిషేధించాలి. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లను పోర్న్ వీడియోలను నిలిపివేయాలి. గల్ఫ్, చైనా, కొరియా లాంటి దేశాల్లో ఇలాంటి వీడియాలో అస్సలు కనిపించవు. వాటిపై సంపూర్ణ నిషేధం ఉంది. మనం మాత్రం యదేచ్ఛగా ప్రోత్సహిస్తున్నాం. ఆన్‌లైన్ బెట్టింగులలో కాసినో యాప్‌ల నుండి పోకర్, రౌలెట్, బ్లాక్ జాక్, జంగ్లీ, రమ్మీ వంటి వాటితో పాటు లాటరీ యాప్‌లు...ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలు. ఇవన్నీ ఎక్కడో విదేశాల నుండి నడిపిస్తున్నా మన దేశంలో మరింత ప్రభావం చూపిస్తున్నాయి. వీటి బారిన పడి యువత ప్రాణాలు తీసుకుంటున్నారు. డబ్బులు వస్తున్నాయి కదాని టీవీ ఛానళ్లు యధేచ్ఛగా ప్రసారం చేస్తున్నాయి. క్రికెట్ బెట్టింగ్ యాప్ మాయలో పడి ఇటీవల ఓ యువకుడు ఇంట్లో ఉన్నదంతా ఊడ్చేశాడు. అలాగే దానిని మానుకోలేక పోతున్నానని చెబుతూ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దేశంలో ఇలాంటి ఆత్మహత్యలు నిత్యకృత్యంగా మారాయి. ఇటీవల హైదరాబాద్ మెట్రో రైల్లో ఓ బెట్టింగ్ యాప్‌ను అడ్వ్టంల్గ÷జ్ చేసినప్పుడు పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో తొలగించాల్సి వచ్చింది. ఈ బెట్టింగ్ యాప్‌ల ను సినీ, క్రీడా స్టార్లు ప్రమోట్ చేయడంతో ఈ మోజులో సామాన్యులూ పడుతున్నారు. వీటికి తోడు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల చెలామణీ విపరీతంగా పెరిగింది. పెద్ద పెద్ద సెలబ్రెటీలు, సినిమా స్టార్లు, రాజకీయ నాయకుల పిల్లలు దొరికిపోవడం చూస్తున్నాం. ఇలాంటివన్నీ తక్షణం నిషేధిస్తే తప్ప యువతను రక్షించుకోలేం. ఇక సంక్రాంతి వచ్చిందంటే చాలు....కోడి పందేలు పెద్దఎత్తున జరుగుతాయి. కోర్టులు వీటిని నిషేధించినా రాజకీయ నాయకులే దగ్గరుండి మరీ కోడిపందేలు ఆడించడం చూస్తున్నాం. దీంతో కోట్లాది రూపాయలు ఏటా చేతులు మారుతున్నాయి. కొందరను బికారులై రోడ్డున పడుతున్నారు. పేకాట స్థావరాలకు లెక్కలేదు. చాటుమాటుగా నేటికీ పేకాటను ఆడేస్తున్నారు. యువతతో పాటు స్కూల్ పిల్లలు సైతం వారి తల్లిదండ్రుల ఫోన్లలో ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఫోన్ నుండే యుపిఐ ల ద్వారా లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్న ఘటనలు మన కళ్ల ముందే కనబడుతున్నాయి. నిర్దిష్టంగా లెక్కలు లేకపోయినా వీటి పర్యవసానంగా ఆత్మహత్యలు చేసుకున్నవారు, తమ ఆస్తులను అమ్ముకున్నవాళ్లు వేలల్లో ఉంటున్నారు. ఆర్థికంగా అనేక కుటుంబాలు చితికిపోయాయి. ఎన్నో కుటుంబాలు అనాధలయ్యాయి. పిల్లలను పోగొట్టుకున్న తల్లిదండ్రులు బాధలు వర్ణనాతీతం. వీటి కోసం హత్యలు కూడా జరిగినట్టు వార్తలు చూస్తున్నాం.. ఈ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సెలబ్రెటీలు, యూట్యూబర్లు తోణం స్పందించాలి. సమాజానికి చేటు చేస్తున్న ఇటువంటి యాప్‌ల ద్వారా డబ్బు సంపాదించాలన్న యావ నుంచి వారు బయటపడాలి. బెట్టింగ్ క్రీడలో వందల కోట్ల రూపాయలు కాజేసిన వారిపై ఇక్కడ కేసులు నమోదు కావడంతో దుబాయ్ లాంటి దేశాలకు పారిపోయినా ప్రభుత్వాలు కళ్లప్పగించి చూస్తున్నాయి. ఈ బెట్టింగ్

యాప్‌లపై 'పబ్లిక్ గేంబ్లింగ్ యాక్ట్ 1867' వచ్చినా, అనంతర కాలంలో వీటిపై నిర్ణయాధికారం ఆయా రాష్ట్రాలకు వదిలేయడంతో అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఈ బెట్టింగ్ ఆటల ప్రభావం మరింత పెరగడంతో 2023లో 174 యాప్‌లను నిషేధించినా ఇంకా అనేక యాప్‌లకు అనుమతులు ఉండడం, మరికొన్నిటిని విదేశాల నుండి నిర్వహిస్తుండడంతో ఈ జూదం మోజు మన దేశంలో కూడా తీవ్రంగా ఉంది.

ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై 28 శాతం జి.ఎస్.టి వసూలు చేస్తున్న మన ప్రభుత్వానికి ఏడాదికి 7 వేల కోట్లు ఆదాయం వస్తున్నది. వచ్చే ఏడాది 14 వేల కోట్లు జిఎస్‌టి వసూళ్ల టార్గెట్‌గా పెట్టుకున్నట్లు- కేంద్రం ప్రకటించింది. దీనిపై దండిగా ఆదాయం రావడంతో నిషేధంపై ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదు. ప్రజలు ఊమయినా ఫరవాలేదు... మా ప్రభుత్వానికి ఆదాయం రావాలనే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. సులభంగా ఆదాయం రావాలన్న మోజులో యువత ఉన్నట్లుగానే, ప్రభుత్వాలకు కూడా జిఎస్టీ ద్వారా ఆదాయం పెరిగితే చాలన్న విధంగా ఉంది. పన్నుల రూపంలో ఆదాయం వస్తుందంటే దేనినైనా ప్రమోట్ చేస్తామన్న రీతిలో ప్రభుత్వం తీరు ఉంది. వ్యభిచారంపై వందశాతం జిఎస్టీ వస్తుందంటే..అనుమతిస్తారా అన్నది ఆలోచించాలి. కేంద్రం తక్షణం ఇలాంటి దుర్మార్గపు యాప్‌లను నిషేధించాలి. వీటిపై తక్షణం నియంత్రణ విధించాలి. ఆన్‌లైన్ జూదానికి యువత బానిసలు అవుతుంటే ఉపేక్షించడం సరికాదు. సులువుగా డబ్బు సంపాదించేయాలనే యావతో యువత మోసపోతుంటే...

(ఆధ్యాత్మిక చింతన)



## తిరుమలలో పెరిగిన రద్దీ

### వైభవంగా గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు

**తి**రుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం తరలివచ్చారు. దీంతో వైకుంఠ కాంప్లెక్స్ లోని 31 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. ఈ క్రమంలో టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం 12 గంటల సమయం పడుతుంది. ఇక, గురువారం శ్రీవారిని 58,864 మంది భక్తులు దర్శించుకున్నారు. 25,784 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీ ఆదాయం రూ.4.51 కోట్లుగా ఉందని టిటిడి అధికారులు వెల్లడించారు. ఇదిలావుంటే తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మూత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 8 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలుగా వర్ణిస్తున్నాయి. అందువల్ల అశ్వాన్ని అధిరోహించిన పరమాత్మ ఇంద్రియాలను నియమించే నియామకుడు. పరమాత్మను అశ్వస్వరూపంగా కృష్ణయజుర్వేదం తెలియజేసింది. స్వామి అశ్వ వాహనాధిరూఢుడై భక్తులకు దర్శనమిచ్చి తద్వారా తన కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తూ కలిదోషాలకు దూరంగా ఉండమని నామ సంకీర్తనాద్యుపాయాలను ఆశ్రయించి తరించమని ప్రబోధిస్తున్నాడు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండ్ ముని శంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## వక్ఫ్ బిల్లు ఆమోదంపై ప్రధాని హర్షం

చారిత్రాత్మక మలుపు అని పేర్కొన్న మోడీ

వక్ఫ్ సవరణ బిల్లు-2025 ఎట్టకేలకు పార్లమెంటు ఆమోదం పొందడంతో ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రక అవశ్యకత ఉన్న బిల్లు అని తెలిపారు. దేశవ్యాప్తంగా విస్తృత చర్చతో పాటు- అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాల నడుమ ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించాయి. తొలుత బుధవారం సుదీర్ఘ చర్చ అనంతరం లోక్‌సభ ఆమోదించగా, గురువారం కూడా రాజ్యసభలో 12 గంటల పాటు చర్చించిన తరవాత బిల్లు ఆమోదం పొందింది. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. ఇదో చరిత్రాత్మక మలుపు అని హర్షం వ్యక్తంచేశారు. కొన్ని దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని పేర్కొన్న ఆయన.. తాజా బిల్లుతో ఇన్నాళ్లూ అట్టడుగున ఉండిపోయిన వర్గాలకు మేలు చేకూరుతుందని వ్యాఖ్యానించారు. వారి గళం వినిపించే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత లోపించాయి. ముఖ్యంగా ముస్లిం మహిళలు, పేద ముస్లింల ప్రయోజనాలను దెబ్బతీసింది. ఇప్పుడు పార్లమెంట్‌లో ఆమోదం లభించడంతో వారి హక్కులకు భద్రత లభించినట్లయ్యింది. ఈ బిల్లుతో ఇప్పుడు సామాజిక న్యాయం జరిగే ఓ ఆధునిక యుగంలోకి మనం ప్రవేశిస్తున్నాం. ప్రతి పౌరుడి గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వడానికి మేం కట్టు-బడి ఉన్నాం. ఇదే మార్గంలో పయనిస్తూ బలమైన, సమ్మిళిత భారత్‌ను కలిసి నిర్మిద్దామని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రస్తుతం బిమ్‌స్టెక్ సదస్సు నిమిత్తం థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ దీనిపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. వక్ఫ్ సవరణ బిల్లు, ముసల్మాన్ వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం ఓ చరిత్రాత్మక మలుపు అని పేర్కొన్నారు. సామాజిక,ఆర్థిక న్యాయం, పారదర్శకత, సమ్మిళిత వృద్ధి కోసం మన సమష్టి అన్వేషణలో ఓ కీలక ఘట్టం అని అభివర్ణించారు. ఇలాంటి చట్టాల బలోపేతం కోసం సహకరించిన కమిటీ సభ్యులు, చర్చల్లో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులకు కృతజ్ఞతలుతెలిపారు. ఇందులో సవరణల కోసం పార్లమెంటరీ కమిటీకి తమ విలువైన సూచనలు పంపిన పౌరులకు ప్రత్యేక ధన్యవాదాలని ప్రధాని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. సుదీర్ఘ చర్చ తర్వాత బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లు, 'ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహార) బిల్లు'కు.. గురువారం రాజ్యసభ కూడా ఆమోదముద్ర వేసింది. ఇక, రాష్ట్రపతి సంతకం కోసం ఈ బిల్లులను ప్రభుత్వం పంపించనుంది. అక్కడ ఆమోదం పొందిన తర్వాత చట్టంగా మారనుంది. వక్ఫ్ బిల్లు పేరును...యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ బిల్లుగా (ఉమీద్-యుఎంఈఈడీ)గా ప్రభుత్వం పేర్కొంది.




## రికార్డు స్థాయిలో మారుతి కార్ల ఉత్పత్తి

న్యూఢిల్లీ: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ మరో రికార్డును సృష్టించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 23.4 లక్షల యూనిట్ల వాహనాలను ఉత్పత్తి చేసింది. ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో వాహనాలను ఉత్పత్తి చేయడం ఇదే తొలిసారని కంపెనీ పేర్కొంది. కేవలం ప్యాసింజర్ వాహనాలను భారత్‌కు తయారు చేసి ఈ రికార్డు నెలకొల్పినట్టు దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా వెల్లడించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవో హిసాచి తకేచి మాట్లాడుతూ..ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో కార్లను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ ఒకే దేశంలో ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో ఉత్పత్తి జరుపడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0ని ప్రకటించడంతోపాటు మార్కెట్లు మరింత బలోపేతం కావడం, చిన్న స్థాయి కార్లకు పెరుగుతున్న డిమాండ్‌తో కార్ల అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఏటా ఉత్పత్తి సామర్థ్యాన్ని 40 లక్షలకు పెంచుకునేయోచనలో ఉన్నట్టు ఆయన తెలిపారు. గతేడాది డిజైర్, ఫ్రాంక్స్, స్విఫ్ట్, ఎర్టిగా, బాలెనో మోడళ్లు అత్యధికంగా అమ్ముడయ్యాయి. ప్రస్తుతం సంస్థకు దేశవ్యాప్తంగా నాలుగు ఉత్పత్తి కేంద్రాలు ఉండగా, ఐదో ప్లాంట్ త్వరలో అందుబాటులోకి రాబోతున్నది.

## వాట్సాప్‌లో కొత్త ఫీచర్స్.. ఇక్కడే మొబైల్ రీఛార్జ్!




ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ యూజర్ల కోసం.. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్స్ పరిచయం చేస్తూనే ఉంది. ఇందులో భాగంగానే ఇప్పుడు మొబైల్ ప్రీపెయిడ్ రీఛార్జ్ చేసుకోవడానికి కావలసిన కొత్త సదుపాయం అందుబాటులోకి తెచ్చింది. దీనికోసం పేయూతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంది. ప్రస్తుతం వాట్సాప్ పరిచయం చేసిన ఈ మొబైల్ ప్రీపెయిడ్ రీఛార్జ్ ఫీచర్ అనేది ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు దశలవారీగా అందుబాటులోకి వస్తుంది. ఇకపై పేటీఎం లేదా గూగుల్ పే వంటి ఇతర పేమెంట్ యాప్‌లతో పనిలేకుండానే.. నేరుగా వాట్సాప్ ద్వారానే రీఛార్జ్ చేసుకోవచ్చు. వాట్సాప్ హోమ్ స్క్రీన్‌పై ప్రత్యేకంగా రూపాయి ఐకాన్‌ను జోడించింది. రీఛార్జ్ చేయడానికి ఆ ఐకాన్‌పై ట్యాప్ చేయాలి. మొబైల్ ప్రీపెయిడ్ రీఛార్జ్ ఆప్షన్‌ను ఎంచుకుని, మీరు రీఛార్జ్ చేయాలనుకుంటున్న నెంబర్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. అది పూర్తయ్యాక, ఖూ×, డెబిట్ కార్డ్ లేదా క్రెడిట్ కార్డ్ వంటి మీకు నచ్చిన చెల్లింపు పద్ధతిని ఎంచుకుని.. చెల్లింపును పూర్తి చేయాలి.

## ఆరు సీట్ల టెస్లా కారు.. వచ్చేసింది ఇండియా..



ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా.. భారత మార్కెట్లో మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా ఆరు సీట్ల సామర్థ్యం కలిగిన సరికొత్త 'మోడల్' లాంగ్ వీల్ బేస్ (ూఔదీ) వేరియంట్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్-షోరూమ్ ధరను రూ. 61.99 లక్షలుగా నిర్ణయించారు. తాజా చేరికతో భారత్‌లో మోడల్ శ్రేణి ఇప్పుడు మొత్తం మూడు వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. వీటి ధరలు రూ. 59.89 లక్షల నుండి ప్రారంభమై రూ. 67.89 లక్షల వరకు ఉన్నాయి. ఈ కొత్త వెర్షన్ ప్రధాన ఆకర్షణ దీని విస్తరించిన వీల్ బేస్. 3,040 మిమీ పొడవైన వీల్ బేస్‌తో రూపొందించిన ఈ కారులో 2о2о2 లేఅవుట్‌తో ఆరు సీట్ల కాన్ఫిగరేషన్‌ను అందించారు. స్టాండర్డ్ మోడల్‌తో పోలిస్తే, ఈ ఎల్‌డబ్ల్యూబీ వేరియంట్ వెనుక సీటు ప్రయాణికులకు మరింత విశాలమైన స్థలాన్ని (లెగ్ రూమ్), సౌకర్యాన్ని కల్పిస్తుంది. ముఖ్యంగా పెద్ద కుటుంబాలకు, ఎక్కువ మంది ప్రయాణించే వీలున్న కారు కోసం చూస్తున్న వినియోగదారులకు ఇది ఒక ఎంపికగా నిలుస్తుంది.ఫీచర్ల పరంగా చూస్తే, ఈ కారులో అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఫీచర్లు ఉన్నాయి. క్యాబిన్‌లో 16-అంగుళాల భారీ టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డ్యూయల్ వైర్‌లెస్ ఛార్జింగ్ ప్యాడ్‌లు, హీటెడ్-వెంటిలేటెడ్ సీట్లు ఉన్నాయి. డ్రైవర్ సౌకర్యం కోసం హీటెడ్ స్టీరింగ్ వీల్, ఫ్రంట్ సీట్ల వద్ద థై సపోర్ట్ వంటి సౌకర్యాలతో పాటు వెనుక వరుసలో ఉన్న వారికోసం పిల్లర్-మౌంటెడ్ రియర్ ఏసీ వెంట్లను కూడా ఏర్పాటు చేశారు. టెస్లా సిగ్నేచర్ మినిమలిస్ట్ డిజైన్, ఏరోడైనమిక్ లుక్ ఈ కారు సొంతం.సామర్థ్యం విషయంలోనూ ఈ మోడల్ అగ్రస్థానంలో నిలుస్తుంది. ఇందులో అమర్చిన 88 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్, డ్యూయల్ మోటార్ సెటప్ ద్వారా ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఏకంగా 681 కిలోమీటర్లు (ఔూ సర్టిఫైడ్) ప్రయాణించవచ్చు. ఇక స్పీడ్ విషయానికి వస్తే.. కేవలం 5 సెకన్లలోనే సున్నా నుండి 100 కిలోమీటర్ల వేగాన్ని ఇది అందుకుంటుంది. పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్‌కు అనుగుణంగా, అత్యంత శక్తివంతమైన, విలాసవంతమైన ఫ్యామిలీ ఎస్‌యూవీగా ఈ టెస్లా మోడల్ కారు భారత మార్కెట్లో తన ఉనికిని చాటనుంది.

# టెక్ దేశానికి వీసా ఫీజులు పెరుగుతున్నాయ్..!




జపాన్‌లో నివసిస్తున్న విదేశీయులకు, అక్కడికి వెళ్లాలనుకునే వారికి ఆ దేశ ప్రభుత్వం షాకింగ్ వార్త చెప్పింది. ఇమ్మిగ్రేషన్ కంట్రోల్ యాక్ట్‌కు సవరణలు చేయడం ద్వారా వీసా పునరుద్ధరణ (=వఅవఝశ్రీ), శాశ్వత నివాస (ూవతీఝఅవత్ =వంఱఎవఅఛఎ) రుసుములను భారీగా పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ఏజెన్సీ ప్రతినిధి జపాన్ పార్లమెంటు దిగువ సభలో వివరాలను వెల్లడించారు.

**ప్రతిపాదిత కొత్త ఫీజుల వివరాలు**

ప్రస్తుత నిబంధనల ప్రకారం వీసా గడువుతో సంబంధం లేకుండా పునరుద్ధరణకు కేవలం 6,000 యెన్లు మాత్రమే వసూలు చేస్తున్నారు. అయితే కొత్త సవరణల ప్రకారం ఈ ధరలు ఆకాశాన్నంటనున్నాయి. 5 ఏళ్ల వీసా రెన్యువల్ కోసం ప్రస్తుతమున్న ఫీజు ఏకంగా 70,000 యెన్లకు పెరగనుంది. స్వల్పకాలిక వీసా (3 నెలలు అంతకంటే తక్కువ) పునరుద్ధరణకు సుమారు 10,000 యెన్లు ఖర్చవుతుంది. ఇక శాశ్వత నివాసం (PR) ఫీజు అత్యంత భారీగా పెంచుతున్నారు. ప్రస్తుతం 10,000 యెన్లు ఉన్న పీఆర్ రుసుము, ఏకంగా 2,00,000 యెన్లకు పెరగనుంది.

**గరిష్ఠ పరిమితులు ఖరారు చేసిన ప్రభుత్వం**

ఫీజుల పెంపుపై ప్రభుత్వం కేబినెట్ ఆమోదం కోసం ఇమ్మిగ్రేషన్ కంట్రోల్ యాక్ట్ సవరణలను సమర్పించింది. ఇందులో భాగంగా గరిష్ఠ ఫీజు పరిమితులను కూడా నిర్ణయించింది. శాశ్వత నివాసం కోసం గరిష్ఠంగా 3,00,000 యెన్ల వరకు వసూలు చేసే అవకాశం ఉంటుంది. ఇతర వీసా కేటగిరీలకు గరిష్ఠంగా 1,00,000 యెన్ల వరకు పరిమితి విధించారు. అదే సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దరఖాస్తుదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. అర్హతను బట్టి వారికి ఫీజులో తగ్గింపు లేదా పూర్తి మినహాయింపు ఇచ్చే నిబంధనలను కూడా అధికారులు పొందుపరిచారు.

**పెంపునకు కారణం ఏంటి?**

మారుతున్న పరిపాలనా అవసరాలు, ఇమ్మిగ్రేషన్ నియంత్రణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే క్రమంలో ఈ ఫీజుల సర్దుబాటు తప్పనిసరని ప్రభుత్వం భావిస్తోంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, పర్యవేక్షణ ఖర్చులను భర్తీ చేయడానికి ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.



## భగ్గుమన్న పశ్చిమాసియా

దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు భారీ పతనాన్ని మూటగట్టుకున్నాయి. గత మూడు రోజులుగా కొనసాగుతున్న సానుకూల ధోరణికి బ్రేక్ వేస్తూ బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు కుప్పకూలాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇరాన్-అమెరికా మధ్య ముదురుతున్న యుద్ధ మేఘాలు మదుపరుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. నేటి ట్రేడింగ్ సెషన్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 756 పాయింట్లు పతనమై 78,516 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 198 పాయింట్లు నష్టపోయి 24,378 వద్ద ముగిసింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తోంది. అమెరికా విధించిన ఆంక్షలు, ఇరాన్ ప్రతిచర్యల నేపథ్యంలో హార్ముజ్ జలసంధి మూతపడటం చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ మార్గం గుండానే ప్రపంచంలోని 20% చమురు రవాణా జరుగుతుంది. తాజా దాడుల వార్తలు ఇన్వెస్టర్లలో ఆందోళన నింపడంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మదుపరులు మొగ్గు చూపుతున్నారు. యుద్ధం కారణంగా ఇటీవల ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 120 డాలర్ల మార్కును దాటడం భారత్ వంటి దిగుమతి దేశాలకు పెద్ద దెబ్బ. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. తాజా గణాంకాల ప్రకారం, మార్చి నెలలో ద్రవ్యోల్బణం ఊహించిన దానికంటే ఎక్కువగా 3.3% కి పెరగడం, భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉండటం మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. ద్రవ్యోల్బణం అదుపులోకి రాకపోవడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తాయన్న ఆశలు ఆవిరయ్యాయి. 'వడ్డీ రేట్లు తగ్గకపోగా, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి బ్యాంకులు మరింత కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది'

## యూఏఈకి 67 శాతం తగ్గాయ్




### సౌదీకి 45 శాతం క్షీణత

### ఈఈపీసీ డేటా వెల్లడి

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశ ఇంజనీరింగ్ ఎగుమతులపై ప్రభావం చూపిస్తోంది. ఇంజనీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఈఈపీసీ)గణాంకాల ప్రకారం.. మార్చి నెలలో యూఏఈకి ఎగుమతులు 237 మిలియన్ డాలర్లకు తగ్గాయి. 2025 మార్చిలో ఎగుమతులు 715 మిలియన్ డాలర్లతో పోల్చితే 66.8 శాతం పడిపోయాయి. సౌదీ అరేబియాకు సైతం మార్చి నెలలో ఎగుమతులు 248 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో ఈ దేశానికి ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 450 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అంటే 45 శాతం తగ్గినట్టు తెలుస్తోంది. మొత్తం మీద మార్చి నెలలో దేశ ఇంజనీరింగ్ ఎగుమతులు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చిచూసినప్పుడు 1 శాతం పెరిగి 10.94 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2025--26) మొత్తం మీద ఇంజనీరింగ్ ఎగుమతులు అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 5 శాతం వృద్ధితో 122.43 బిలియన్ డాలర్లకు చేరాయి. 2030 నాటికి ఇంజనీరింగ్ ఎగుమతులను 250 బిలియన్ డాలర్లకు (రెట్టింపు) చేర్చాలన్నది లక్ష్యం. గత ఆర్థిక సంవత్సరం వస్తు ఎగుమతుల్లో ఇంజనీరింగ్ వాటా 27.71 శాతంగా ఉంది. అమెరికా టారిఫ్‌లు బాదేసినా ఆ దేశానికి గత ఆర్థిక సంవత్సరంలో ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 2.3 శాతం పెరిగి 19.6 బిలియన్ డాలర్లకు చేరాయి. జర్మనీకి 14.6 శాతం అధికంగా 4.96 బిలియన్ డాలర్లు, యూకేకి 18.2 శాతం అధికంగా 4.74 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. చైనాకు 32 శాతం అధికంగా 3.53 బిలియన్ డాలర్లు, కొరియాకి 3 బిలియన్ డాలర్లు (16.7 శాతం అధికం) చొప్పున ఎగుమతులు వెళ్లాయి.

**ఇవి ఎక్కువ -- ఇవి తక్కువ**

గత ఆర్థిక సంవత్సరంలో మోటారు వాహనాలు, కార్లు, టూ వీలర్లు, రాగి, ఐరన్ అండ్ స్టీల్, ఎలక్టరిక్ మెషినరీ ఎగుమతులు ఎక్కువగా జరిగాయి. అదే సమయంలో ఎయిర్‌క్రాఫ్ట్, స్పేస్‌క్రాఫ్ట్ విడిభాగాలు, మెడికల్, సైంటిఫిక్ ఇనుస్ట్రుమెంట్ల ఎగుమతులు తగ్గాయి.

# జోరుగా డాలర్ బిలియనీర్లు!

**2031నాటికి 51% పెరిగి దేశంలో 313 మందికి చేరవచ్చు**

**నైట్ ఫ్రాంక్ 20వ వెల్త్ రిపోర్ట్‌లో అంచనా**

**ప్రస్తుతం అమెరికా, చైనా తర్వాత భారత్‌లోనే అత్యధికంగా డాలర్ బిలియనీర్లు.**

**గడిచిన ఐదేండ్లలో దేశీయంగా 58 శాతం పెరిగిన సంఖ్య.**




ప్రపంచవ్యాప్తంగా యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ జనాభాలో భారత్‌కు 6వ స్థానం.దేశంలో 35.4 శాతం అల్ట్రా హై నెట్ వర్త్ ఇండివిడ్యువల్స్ ముంబైకి చెందినవారే. సాంకేతిక, పారిశ్రామిక, క్యాపిటల్ మార్కెట్స్‌లో వేగంగా పెరుగుతున్న సంపద.డిజిటలైజేషన్, స్టాక్ మార్కెట్లు, ప్రైవేట్ క్యాపిటల్, కుటుంబ వ్యాపారాలు.. ఇలా అన్నీ సంపద సృష్టికి దన్నుగా నిలుస్తున్నాయి. భారత్‌లో సంపద పెరుగుదల.. విస్తరిస్తున్న దేశ ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తున్నది. పెట్టుబడిదారులు, ఔత్సాహిక వ్యాపార-పారిశ్రామికవేత్తల్లో బలపడుతున్న నమ్మకానికీ అద్దం పడుతున్నది. శిశిర్ బైజల్, నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ వచ్చే ఐదేండ్లలో దేశంలో సంపన్నుల సంఖ్య భారీగా పెరుగనుందని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఓ తాజా నివేదికలో అంచనా వేసింది. 2031నాటికి భారత్‌లో అల్ట్రా హై నెట్ వర్త్ ఇండివిడ్యువల్స్ (నికరంగా రూ.282 కోట్లు, ఆపై సంపద కలిగినవారు-డాలర్‌తో పోల్చితే ప్రస్తుత రూపాయి మారకం విలువ ప్రకారం 30 మిలియన్ డాలర్లు, అంతకుమించి సొమ్మున్నవారు) సంఖ్య 26 శాతం ఎగబాకి 25,217 మందికి చేరవచ్చని గురువారం విడుదల చేసిన తమ 20వ వెల్త్ రిపోర్ట్ 2026 ఎడిషన్‌లో పేర్కొన్నది.అలాగే డాలర్ బిలియనీర్లు (రూ.9,400 కోట్లు సంపద కలిగినవారు-100 కోట్ల డాలర్ల సొమ్మున్నవారు) 51 శాతం ఎగిసి 313 మందికి పెరుగవచ్చున్నది. టెక్నాలజీ, ఇండస్ట్రియల్స్, డెట్-ఈక్విటీ, ఫారెక్స్, డెరివేటివ్స్, ఈటీఎఫ్, ప్రైమరీ, సెకండరీ మార్కెట్స్ వ్యాప్తంగా పెరుగుతున్న సంపద సృష్టే తమ అంచనాలకు కారణమని వివరించింది. కాగా, ప్రస్తుతం (ఈ ఏడాది ఆరంభంలో) భారత్‌లో అల్ట్రా హై నెట్ వర్త్ ఇండివిడ్యువల్స్ (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) 19,877 మంది ఉన్నారని, డాలర్ బిలియనీర్ల సంఖ్య 207గా ఉన్నదని నైట్ ఫ్రాంక్ ఈ సందర్భంగా తెలియజేసింది.



# ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన శ్రీముఖి..

## హైదరాబాద్‌లో కొత్త రెస్టారెంట్ ప్రారంభం

టాలీవుడ్ ప్రముఖ యాంకర్, నటి శ్రీముఖి ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న క్యాపిటల్ పార్క్‌లో తన స్నేహితులు శ్రావణ్, ఆనంద్, రవిలతో కలిసి 'ఫుర్సత్ అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ.. తనకు భోజనం అంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా బిర్యానీ, చికెన్ కర్రీలతో పాటు వెజిటేరియన్ వంటకాలను కూడా ఆస్వాదిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రశాంతంగా గడిపేలా, ఒక మంచి అనుభూతిని అందించేలా ఫుర్సత్‌ను తీర్చిదిద్దినట్లు ఆమె వివరించారు. ఈ రెస్టారెంట్‌లో సుమారు 300 మంది కూర్చునే సదుపాయంతో పాటు ప్రత్యేకమైన బ్యాంక్వెట్ హాల్స్ కూడా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నల్లి గోష్ట్ బిర్యానీ వంటి ప్రత్యేక వంటకాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని శ్రీముఖి పేర్కొన్నారు. భాగస్వాములు శ్రావణ్, ఆనంద్, రవి మాట్లాడుతూ.. రుచి, సేవలలో ఎక్కడా రాజీ పడకుండా సంప్రదాయ, ఆధునిక వంటకాల కలయికతో మెనూని రూపొందించామని చెప్పారు. కార్పొరేట్ సమావేశాలకు, కుటుంబ వేడుకలకు ఫుర్సత్ ఒక ఉత్తమ గమ్యస్థానంగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వినూత్నమైన డైనింగ్ కాన్సెప్ట్‌తో ప్రారంభమైన ఈ రెస్టారెంట్, శ్రీముఖి భాగస్వామ్యంతో హైదరాబాద్ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



# ముందు అనుకున్నారు.. ఫైనల్‌గా ఫిక్స్ చేశారా?

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న సినిమా 'పెద్ది'.. మరో నెల రోజుల్లో థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే షూటింగ్ నడుస్తుండటంతో వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని రూమర్స్ వస్తున్నాయి. మరోవైపు చరణ్ పుట్టినరోజున ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ అవుతాయని అధికారికంగా ప్రకటించడంతో వాయిదా లాంటిది లేదని పరోక్షంగా క్లారిటీ ఇచ్చినట్లయింది. అయితే ఈ మూవీలోని ఐటమ్ సాంగ్ ఎవరు చేస్తారా అనే ప్రశ్న కూడా ఇంకా అలానే మిగిలిపోయింది. ఫైనల్‌గా దానికి సమాధానం దొరికేసినట్లు కనిపిస్తోంది. గతంలో 'పెద్ది' ఐటమ్ కోసం పూజా హెగ్డే, ఆయేషా ఖాన్, మృణాల్ ఠాకుర్.. ఇలా చాలా పేర్లు వినిపించాయి. కానీ పాట షూటింగ్ ఇంకా బ్యాలెన్స్ ఉండేసరికి ఎవరిని తీసుకున్నారనే విషయం బయటకు రాలేదు. చివరకు ఇప్పుడు ముందు అనుకున్న వాళ్లలో మృణాల్ ఠాకుర్‌ని ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో ఈమె హీరోయిన్‌గా చేసిన 'డకాయిట్' రిలీజ్ కానుంది. దీని ప్రమోషన్స్‌లో పాల్గొనేందుకు ప్లస్ 'పెద్ది' సాంగ్ చేసేందుకుగానూ రాబోయే కొన్నిరోజులు ఈమె హైదరాబాద్‌లోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ ఐటమ్ పాటలో చరణ్-మృణాల్‌తో పాటు జాన్వీ కపూర్ కూడా కాసేపు కనిపిస్తుందని అంటున్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ విలేజ్ డ్రామాగా తెరకెక్కించారు. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు చేశారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందించాడు. ఇప్పటికే రెండు పాటలు రిలీజ్ కాగా రెండూ సూపర్ హిట్ అయ్యాయి.



# ధనుష్‌కి జోడీగా రుక్మిణి..

తక్కువ టైంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్. సొంత భాషలో హిట్స్ ఉన్నప్పటికీ తెలుగు, తమిళంలో చేసిన చిత్రాలన్నీ డిజాస్టర్స్ అయ్యాయి. ప్రస్తుతం ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీలో హీరోయిన్‌గా చేస్తోంది. అయితే తమిళంలో చేసిన మూవీస్ ఫ్లాప్ అయినప్పటికీ.. ఇప్పుడు రుక్మిణి మరో అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. వరుస సినిమాలతో అలరిస్తున్న తమిళ హీరో ధనుష్.. ప్రస్తుతం విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో 'కర' మూవీ చేశాడు. మమిత బైజు హీరోయిన్. వచ్చే నెల 30న థియేటర్లలోకి రానుంది. మరోవైపు 'అమరన్' తీసిన రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలోనూ ధనుష్ ఓ సినిమా చేస్తున్నాడు. డీ55 పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో సాయిపల్లవి, శ్రీలీల హీరోయిన్స్. సాయి అభయంకర్ సంగీతాన్ని అందిస్తున్నాడు. దీని తర్వాత ధనుష్ మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'లబ్బర్ పందు' ఫేమ్ తమిళసన్ పచ్చముత్తు దర్శకత్వం వహించనున్నట్లు టాక్. ఇందులోనే దక్షిణాది క్రేజీ హీరోయిన్ రుక్మిణి వసంత్.. ధనుష్ సరసన నటించనుందట. ఇదే నిజమైతే వీళ్లిద్దరి కాంబోలో రూపొందే తొలి చిత్రం ఇదే అవుతుంది. ఈ ?ప్రాజెక్టుకి అనిరుధ్ సంగీంతమందించనున్నాడట. ఇందులో ప్రతినాయకుడిగా విజయ్ కుమార్ నటిస్తారని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

# విజయ్ సేతుపతికి జోడీగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్!



చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు నటుడు విజయ్ సేతుపతి. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఎడాపెడా చిత్రాలు చేస్తున్నాడు. తెలుగులో పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నాడు. ప్రస్తుతం వెట్రిమారన్ డైరెక్షన్‌లో శింబు హీరోగా నటిస్తున్న అరసన్ చిత్రంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. అలాగే మరికొన్ని సినిమాల్లోనూ యాక్ట్ చేస్తున్న ఈయన తాజాగా మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. బాలీవుడ్ బ్యూటీ విడాముయుర్చి ఫేమ్ మగిళ్ తిరుమేణి దర్శకత్వంలో సినిమా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించనున్నట్లు భోగట్టా! ఇకపోతే ఇందులో విజయ్ సేతుపతికి జంటగా బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ను నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఆఫర్‌కుగానీ ఆమె ఒప్పుకుంటే కోలీవుడ్‌లో మరో క్రేజీ కాంబో షురూ అయినట్లే! మరి ఇదెంతవరకు నిజమన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకు ఆగాల్సిందే!

# 'స్పిరిట్' భామని రంగంలోకి దించుతున్న నాని?



టాలీవుడ్‌లో మినిమం గ్యారంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని.. ప్రస్తుతం 'ప్యారడైజ్'తో బిజీగా ఉన్నాడు. మరోవైపు 'ఓజీ' సుజీత్ దర్శకత్వంలో త్వరలో ఓ మూవీని ప్రారంభించబోతున్నాడు. ఇవి కాకుండా మరికొన్ని లైన్‌లో ఉన్నాయి. ఇలా కెరీర్ పరంగా మంచి ఫామ్‌లో ఉన్న నాని.. ఇప్పుడు ఓ బోల్ బ్యూటీతో స్క్రీన్ షేర్ చేసుకునేందుకు సిద్ధమయ్యాడట. పలు హిందీ చిత్రాల్లో నటించిన తృప్తి దిమ్రికి.. సందీప్ రెడ్డి వంగా తీసిన 'యానిమల్' మూవీ ఓవర్‌నైట్ స్టార్‌డమ్ తెచ్చిపెట్టింది. బాలీవుడ్‌లో వరస అవకాశాలు అందుకుంటూ బిజీ అయిపోయింది. ప్రస్తుతం తనకు లైఫ్ ఇచ్చిన సందీప్ వంగా తీస్తున్న 'స్పిరిట్'లో ప్రభాస్‌కి జోడీగా చేస్తోంది. మరి మెయిన్ లీడ్ లేదా సెకండ్ హీరోయిన్ అనేది తెలియాల్సి ఉంది. ఇదలా ఉండగానే ఇప్పుడు నాని చేయబోయే ఓ మూవీ కోసం తృప్తిని హీరోయిన్‌గా అనుకుంటున్నారట. ఒకవేళ ఇదే నిజమైతే తృప్తి.. టాలీవుడ్ ఎంట్రీ చిత్రం ఇదే కావొచ్చు. గత కొన్ని సినిమాలతో పాన్ ఇండియా మార్కెట్‌పై దృష్టి పెట్టిన నాని.. అందుకు తగ్గట్లే బాలీవుడ్‌లో మెల్లమెల్లగా గుర్తింపు తెచ్చుకునే పనిలో ఉన్నాడు. ప్రస్తుతం చేస్తున్న 'ప్యారడైజ్'లోనూ ఓ కీలక పాత్ర కోసం రాఘవ్ జ్యూయెల్ అనే నటుడితో కలిసి పనిచేస్తున్నాడు. ఇప్పుడు తృప్తి పేరు వినిపిస్తుంది. చూడాలి మరి ఇందులో ఎంత నిజముందో?

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com